


గౌరవెల్లి రిజర్వాయర్

- పెండింగ్ పనుల పూర్తికి కేబినెట్ ఆమోదం
- రూ.437 కోట్ల విడుదలకు నిర్ణయం
- 17 ఏళ్ల కల సాకారం అవుతుందని రైతుల ఆనందం
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు పొన్నం కృతజ్ఞతలు

గండాలు దాటనున్న గౌరవెల్లి

హుస్నాబాద్, ఆగస్టు 1 : మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ గండాలు ఇక తొలగిపోనున్నాయి. ఇక్కడి పొలాల్లో గోదావరి జలసవ్వడులను చూడాలనే ఈ ప్రాంత రైతాంగ నిరీక్షణ ఫలించబోతుంది. 17 ఏళ్ల క్రితం నుంచి ఈ రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు రిజర్వాయర్ పనులు పూర్తయి నీటిని నింపే అవకాశం ఉన్నా వ్యవసాయ భూములకు నీరందించే కాలువలు లేక.. రిజర్వాయర్ ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో పెండింగ్‌లోనే ఉంటూ వస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ గౌరవెల్లి రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి సవరించిన అంచనా ప్రతిపాదనల ప్రకారం రూ.437 కోట్లు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఇక గౌరవెల్లి రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతాయని రైతులు సంతోషపడుతున్నారు.



డెలివరీ సిస్టర్న్ ద్వారా రిజర్వాయర్‌లోకి విడుదల అవుతున్న గోదావరి జలాలు(ఫైల్)

2007లో శంకుస్థాపన

వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగించే మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాలతో పాటు వరంగల్ జిల్లాలోని పలు గ్రామాలకు సాగు నీరందించాలని శ్రీరాంసాగర్ ఇందిరమ్మ వరద కాలువ గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల నిర్మాణానికి 2007 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హుస్నాబాద్‌లో శంకుస్థాపన చేశారు. ఒప్పందం ప్రకారం ఈ రిజర్వాయర్ల పనులు ఐదేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా రీ డిజైన్ ఇతర కారణాలతో 17 ఏళ్లుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ ఈ రిజర్వాయర్‌ను సందర్శించి దీనిని రీ డిజైన్ చేశారు. 1.4 టీఎంసీలు ఉన్న గౌరవెల్లి రిజర్వాయర్‌ను 8.23 టీఎంసీలకు పెంచారు. దీంతో అదనంగా భూసేకరణ చేయాల్సి వచ్చింది. ఎలాంటి అనుమతులు లేకుండా రిజర్వాయర్ ఎత్తు పెంచారని నిర్వాసితులు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఇప్పటికీ కూడా ఎన్‌జీటీలో ఈ కేసు ఉంది.

ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి

8.23 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లోకి 2 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే 32 మెగావాట్ల సామర్థ్యం ఉన్న చైనా నుంచి వచ్చిన మూడు మోటార్లను బిగించారు. 2022 జూలై 31వ తేదీన అందులోని ఒక మోటార్‌తో 10 నిమిషాల పాటు ట్రయల్ రన్ నిర్వహించారు. మరో రెండు రోజుల అనంతరం అధికారులు రెండో మోటారు, మరో రెండు రోజులకు మూడో మోటారు ట్రయల్‌రన్ చేశారు. గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి నీటిని మిడ్‌మానేరు ద్వారా బెజ్జంకి మండలం తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి తీసుకువస్తారు. మొదటి డిజైన్ ప్రకారం రూ.409 కోట్లతో చేపట్టిన ఈ సొరంగం పనులు పూర్తయిన అనంతరం రీ డిజైన్‌లో భాగంగా అదనంగా మరో రూ.380 కోట్లతో పనులు చేశారు. తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 16 కిలోమీటర్ల దూరంలో రేగొండ వద్ద గౌరవెల్లి రిజర్వాయర్ ఉంటుంది. ఇందులో 12 కిలోమీటర్ల మేర సొరంగం ఉంటుంది. 5.6 మీటర్ల టన్నెల్‌షిప్‌తో 32 క్యూబిక్‌తో నీటిని తీసుకెళ్లే విధంగా సొరంగం నిర్మించారు. 50 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు, 110 మీటర్ల లోతుతో సర్జ్‌పూల్ (నీళ్ల సంపు), 61మీటర్ల పొడవు, 17 మీటర్ల వెడల్పు, 130 మీటర్ల లోతుతో పంపుహౌజ్‌ను నిర్మాణం చేశారు. ట్రయల్ రన్‌తో రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీటిని కూడా నింపారు.

1.06 లక్షల ఎకరాలకు సాగు నీరు

గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయితే 1.06 ఎకరాలకు సాగు నీరు అందనుంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 57,852 ఎకరాలు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 48,148 ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ రిజర్వాయర్‌కు రెండు ప్రధాన కాలువలు ఉండగా కుడి కాలువ ద్వారా 90 వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 16వేల ఎకరాలు సాగవుతాయి.

అడ్డంకులు తొలిగినట్లేనా ?

రిజర్వాయర్ నుంచి వ్యవసాయ భూములకు సాగునీరందించేందుకు కాలువలను నిర్మించాల్సి ఉంది. వీటి నిర్మాణానికి మొత్తం 2800 ఎకరాలు అవసరం ఉందని అధికారులు అంచనా వేశారు. దీంతో పాటు రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కారించాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ సామర్థ్యం పెంచడంతో పాటు, పర్యావరణ అనుమతులతో పాటు ఇతర అనుమతులు లేకుండా నిర్మించారని ముంపు గ్రామమైన గుడాటిపల్లి నిర్వాసితులు జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆశ్రయించారు. దీంతో అనుమతులు వచ్చే వరకు రిజర్వాయర్ పనులు చేపట్టవద్దని అప్పుడు ప్రభుత్వానికి ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది. అయితే, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తే ఆ కేసును ఉపసంహరించుకుంటామని నిర్వాసితులు పేర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయనుండటంతో నిర్వాసితుల సమస్యలు పరిష్కారమై పనులకు అడ్డంకులు తొలుగుతాయని భావిస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

గౌరవెల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయిస్తూ కేబినెట్‌లో ఆమోదం తెలపడం పట్ల హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపి నిధుల కేటాయింపునకు కృషి చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, నాయకులు చిత్తారి రవీందర్, బంక చందు, కోమటి సత్యనారాయణ, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, స్వర్ణలత, వీరన్ననాయక్, వెన్న రాజు తదితరులున్నారు.



హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాబోయే సీజన్‌లో గౌరవెల్లి ద్వారా నీరందిస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్

రాబోయే సీజన్‌లోపు గౌరవెల్లి ద్వారా సాగు నీరందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కాలువలకు సంబంధించి రూ.437 కోట్లు బడ్జెట్‌లో ఆమోదించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారని, అప్పుడే 80 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత కుర్చీ వేసుకొని ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పి పదేళ్లయినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులపై నిరంకుశత్వంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టును సందర్శించి అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం నిధుల కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. ఇక కాలువల నిర్మాణం వేగం చేస్తామని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పొన్నం ప్రభాకర్



బ్యాంకులో ఖాతాదారుల రద్దీ

సర్వర్ డౌన్.. సేవలకు అంతరాయం

రైతులతో బ్యాంకు కిటకిట

కుకునూరుపల్లి, ఆగస్టు 1 : కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఏపీజీవీబీ కొన్నేళ్లుగా మండలంతో పాటు ఇతర మండల ప్రజలకు సేవలను అందిస్తున్నది. బ్యాంకులో భారీగానే ఖాతాలు ఉన్నాయి. ప్రభుత్వం రుణమాఫీ చేయడం, అందులో కొంత మంది రుణమాఫీ కాకపోవడంతో, తెలుసుకోవడం కోసం రైతులు బ్యాంకుకి క్యూ కడుతున్నారు. రుణమాఫీ అయిన రైతులు మరోసారి క్రాప్‌లోన్ తీసుకోవడానికి వస్తున్నారు. మూడు రోజుల నుంచి బ్యాంక్ సర్వర్ పనిచేయకపోవడంతో ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆన్‌లైన్ సేవలు ఆగిపోవడంతో ఖాతాదారులతో పాటు బ్యాంకు సిబ్బందికి తలనొప్పిగా మారింది.

గౌరారం ఎస్‌ఐ సస్పెన్షన్

వర్గల్, ఆగస్టు 1 : గౌరారం ఎస్‌ఐ జె.శివకుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఐ శివకుమార్ పోలీస్ శాఖ సీసీఏ రూల్‌ను అతిక్రమించి క్రమశిక్షణ రహితంగా వ్యవహరించారని అతనిపై ఆరోపణలో రావడంతో విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. రాజన్నజోన్ ఇన్‌చార్జి ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ రహితంగా విధులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు.



ఎస్‌ఐ శివకుమార్

నెల రోజుల్లో 143 మంది బాలకార్మికుల గుర్తింపు

- 'ఆపరేషన్ ముస్కాన్'లో తల్లిదండ్రులకు అప్పగించాం
- షాప్ యజమానులపై 11 కేసులు నమోదు
- సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 1 : నెలరోజుల పాటు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలో 143 మంది బాలకార్మికులను గుర్తించామని సీపీ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. గురువారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. జూలైలో నెల రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 121 మంది బాలురు, 22 మంది బాలికలను గుర్తించి ఆయా రాష్ట్రాల్లోని తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. యజమానులపై 11 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కిరాణం, మెకానిక్‌షాపులు, హోటళ్లు, ఇటుకబట్టీలలో పనిచేస్తున్న పిల్లలను, రోడ్లపై భిక్షాటన చేస్తున్న వారిని రెస్క్యూ చేశామని తెలిపారు. బాలలను వారి తల్లిదండ్రులను, బంధువులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించమని పేర్కొన్నారు. సిద్దిపేట డివిజన్ పరిధిలో 101 మంది, గజ్వేల్ డివిజన్ పరిధిలో 30 మంది, హుస్నాబాద్ డివిజన్ 12 మంది పిల్లలను అప్పగించినట్లు తెలిపారు.

చెరువులకు భద్రత చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 1 : జిల్లాలో హెచ్‌ఎండీఏ పరిధిలోని మర్కుక్, ములుగు, వర్గల్ మండలాల్లో చెరువులకు భద్రతా చర్యల చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆయా మండల రెవెన్యూ, నీటిపారుదల, భూసర్వే అధికారులు, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న మూడు మండలాల్లో చెరువులు, కుంటలను సర్వే అధికారులు భూవిస్తీర్ణం రికార్డులను పరిశీలించి మ్యాప్‌లను సిద్ధం చేయాలన్నారు. మండల రెవెన్యూ, భూ సర్వే నీటిపారుదల శాఖ అధికారులు ఆయా చెరువులు, కుంటల ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో వాటి భూ సర్వే మ్యాప్, సర్వే నంబర్‌లను గోడపై అతికించాలని సూచించారు. హెచ్‌ఎండీఏ మార్గదర్శకాల ప్రకారం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి వాటి భద్రత చర్యలపై చర్చించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, సర్వేలాండ్ ఏడీ వినయ్ కుమార్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్, మండల తహసీల్దార్లు, సర్వేయర్లు, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

రోగుల సహాయకులకే విశ్రాంతి భవనం

'ఆంధ్రజ్యోతి' కథనానికి కలెక్టర్ స్పందన

సిద్దిపేట టౌన్, ఆగస్టు 1 : పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో రోగుల సహాయకుల విశ్రాంతి గదిలో వంటలు చేస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని 'ఆంధ్రజ్యోతి'లో 'తినేదెట్లా!' శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ మనుచౌదరి స్పందిచారు. రోగుల సహాయకుల విశ్రాంతి భవనంలో ప్రస్తుతానికి ఒక క్యాబిన్ ఏర్పాటు చేసుకోని అందులోనే వంటలు చేయాలని, మూత్రశాలలకు, విశ్రాంతి గదికి తాళాలు వేయకుండా చూడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌కు సూచించారు. రోగుల సహాయకులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో రోగుల సహాయకులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



శాసనసభలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ నాయకులు గురువారం జిల్లాలో సీఎం దిష్టిబొమ్మలు దహనం చేసి రాస్తారోకో నిర్వహించారు. సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని హౌజింగ్ బోర్డు కమాన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి ఫ్లెక్సీ దహనం చేస్తున్న చిత్రం పైన చూడవచ్చు

రామ రామసముద్రం

- చెరువులో గుర్రపుడెక్క.. కట్టపై తుమ్మలు, పిచ్చిమొక్కలు
- మూలన పడిన పడవలు.. ధ్వంసమైన పార్క్
- మొదటికొచ్చిన సుందరీకరణ

దుబ్బాక, ఆగస్టు 1 : 'రామసముద్రం చెరువుపై బాల్యంలో ఉత్పలమాల, చంపకమాల పద్యాలు వల్లెవేశాను.. కట్ట మీద పద్యాలు కంఠస్థం చేశా' అంటూ మాజీ సీఎం కేసీఆర్ చెబుతుంటారు. సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం ఆయనే స్వయంగా దుబ్బాక పర్యటనలో రామసముద్రం చెరువు సుందరీకరణకు ఆదేశాలిచ్చారు. ప్రత్యేక నిధులనూ మంజూరు చేశారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం పుణ్యామాని ప్రస్తుతం దుబ్బాక రామసముద్రం చెరువు కథ మళ్లీ మొదటికి వచ్చింది. గుర్రపుడెక్క, తుమ్మలు, పిచ్చిపొదలతో కళావిహీనంగా మారింది.



గుర్రపుడెక్కతో నిండిన దుబ్బాక రామసముద్రం చెరువు

సుందరీకరణకు 2016లో శ్రీకారం

దుబ్బాక రామసముద్రం చెరువు సుందరీకరణకు 2016లో అప్పటి సీఎం కేసీఆర్ సీఎం ప్రత్యేక నిధుల నుంచి రూ.5 కోట్లను మంజూరు చేశారు. అంతేగాక మున్సిపల్ శాఖ నుంచి రూ.50లక్షలతో పిల్లల పార్క్, మరో రూ.60 లక్షలతో జిమ్‌ను ఏర్పాటు చేశారు. చెరువు కట్టపై రెయిలింగ్‌వాల్, పారాపిట్ వాల్, బతుకమ్మ ఘాట్, బ్రిడ్జి, గ్రీనరీ తదితర పనులను రూ.4.80 కోట్లతో మిషన్‌కాకతీయ ద్వారా పూర్తిచేశారు. అంతేగాక మరుగుదొడ్ల నిర్మాణం, చిల్డ్రన్‌పార్క్, జిమ్‌ను మున్సిపల్ శాఖ ప్రత్యేక నిధుల ఏర్పాటు చేశారు. అప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రూ.80 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో రామసముద్రం సుందరీకరణ పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. మరో రూ.60 లక్షల వరకు పనులు మిగిలి ఉన్నాయి.



ఏపుగా పెరిగిన తుమ్మలు, పిచ్చి మొక్కలు

ఉపయోగపడని జిమ్

చెరువు కట్టపై వాకర్స్ కోసం ఏర్పాటు చేయాల్సిన టైల్స్ అసంపూర్తిగానే వదిలేశారు. సగం వరకే పూర్తిచేసి వదిలేశారు. మిగతా సగంలో పొదలు తయారయ్యాయి. ప్రతీ రోజు వందలాది మంది వాకర్లు, వ్యాయామం చేయడానికి వచ్చే వారికి ప్రస్తుతం రామసముద్రం ప్రమాదకరంగా కనిపిస్తుంది. వాకర్‌లు నడిచే టైల్స్ పూర్తి కాకపోవడంతో ఆ దారి గుండా మొక్కలు మొలిచి, పాములు, విషపురుగులు మాటువేస్తున్నాయి. తరచూ పాములు కనిపించడంతో వాకర్స్ భయపడుతున్నారు. రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన జిమ్ కూడా వినియోగించుకోలేని స్థితికి చేరింది.



నిర్వహణ లోపం

గత ప్రభుత్వం, ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన పనుల బిల్లులను విడుదల చేయకపోవడం, నిధుల మంజూరులో జాప్యం చేయడంతో చెరువు సుందరీకరణ పనులు ఎక్కడికక్కడ అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కనీసం చేపట్టిన వాటిని ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో రామసముద్రం పరిస్థితి దయనీయంగా మారింది. చెరువులో అడ్డదిడ్డంగా గుర్రపుడెక్క పేరుకుపోయింది. అయితే, మత్స్యకారులు రెండేళ్ల క్రితం స్వయంగా కొంతమేర గుర్రపుడెక్కను తొలగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగతా గుర్రపుడెక్కతో చెరువు పచ్చని పొలంలా కనిపిస్తోంది. ఇక చెరువు కట్టపై తుమ్మచెట్లు, పిచ్చి మొక్కలు మొలిచాయి. మున్సిపల్ సిబ్బంది వీటిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో ఏపుగా పెరిగాయి. నిర్వహణ లోపంతో సుందరీకరణ పనులను చేపట్టి లాభం లేకుండా పోయింది.

పత్తా లేని పర్యాటక శాఖ

రామసముద్రం చెరువులో బోటింగ్ కోసం పడవలను ఏర్పాటు చేసిన పర్యాటక శాఖ పత్తాలేకుండా పోయింది. పర్యాటకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో ఏడేళ్ల క్రితం తెచ్చిన పడవలతో వీటిని తెచ్చారు. స్థానికంగా ఇద్దరు మత్స్యకారులకు శిక్షణ ఇచ్చి తాత్కాలికంగా నియమించారు. వారికి పర్యాటక శాఖ వేతనాలను ఇవ్వకపోవడంతో మానేశారు. దీంతో పడవలు మూలనపడడంతో వాటిపైనే తూటిచెట్లు అల్లుకున్నాయి.

ఓవైపు సుందరీకరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం, మరోవైపు ఏర్పాటు చేసిన వాటి నిర్వహణ లేకపోవడంతో చెరువు కళావిహీనంగా తయారైంది. ప్రస్తుతం ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించవచ్చు. తుమ్మలు, పిచ్చి మొక్కలను తొలగించి సుందరీకరణ పనులను పూర్తిచేసి కనీసం వాకర్లు ఉపయోగించేలా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా పడవ

మూలనపడిన చిల్డ్రన్ పార్క్

పిల్లల ఆట వస్తువులు మూలనపడ్డాయి. రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన జారుడుబండ, ఉయ్యాలలు, గుర్రపుస్వారీ కుర్చీలు, తదితర ఆటవస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆటవిడుపు సమయంలో చిన్నపిల్లలు వచ్చి ఆహ్లాదానికి ఆడుకోవాల్సిన పార్క్ పిచ్చి మొక్కలతో కనిపిస్తోంది. పాములు, ప్రమాదకర కీటకాలు అక్కడ తిరుగుతుండటంతో చిన్నారులు అక్కడికి వెళ్లడానికి జంకుతున్నారు.



క్రేన్ ఢీకొని మహిళ మృతి

రివర్స్ చేస్తుండగా ప్రమాదం

పటాన్‌చెరు, ఆగస్టు 1: రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమా దాల్లో ఇద్దరు మహిళలు మృత్యువాతపడ్డారు. ఈయర్‌ఫోన్ పెట్టుకుని వెళ్తున్న ఓ మహిళను రివర్స్ తీస్తున్న క్రేన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరో ప్రమాదంలో దంపతులు వెళ్తున్న ద్విచక్రవాహనా న్ని టిప్పర్ ఢీ కొట్టడంతో మరో మహిళ చనిపోయింది.

రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను రివర్స్‌లో వస్తున్న క్రేన్ ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన పటాన్‌చెరులో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ సూపర్ మార్కెట్‌లో పని చేసే అఖిల స్నేహితురాలిలో కలిసి విధులు నిర్వహించేందుకు నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఓ భారీ క్రేన్‌ను డ్రైవర్ గమనించకుండా రివర్స్ తీయడంతో చక్రాల కింద పడి అఖిల అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. అఖిల కూడా ఇయర్ ఫోన్ పెట్టుకుని ఉండటంతో క్రేన్ శబ్దం వినిపించక పోవడంతో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్రేన్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరో మహిళ..

రామచంద్రాపురం, ఆగస్టు 1: రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీరంగూడకు చెందిన నిర్మల(52), సునీల్ దంపతులు గురువారం తెల్లవారు జామున లింగంపల్లి రైల్వేస్టేషన్ వైపు బైక్‌పై బయలు దేరారు. రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ వీరి బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో నిర్మలపై నుంచి టిప్పర్ వెళ్లడంతో చక్రాల కిందిపడి నలిగిపోయింది. ఆమె భర్తకు కాలు విరిగింది. ఈ మేరకు రామచంద్రాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీతంలో వ్యర్థాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 1: వ్యర్థాల నిర్వహణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, ఐపీఎల్ అంతర్జాతీయ ఫోరమ్ 2024పై 14వ అంతర్జాతీ య సదస్సును గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులతో చర్చలు, విజ్ఞాన భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1 వరకు హైబ్రీడ్ విధానంలో ఈ సదస్సు నిర్వ హించనున్నట్టు వర్సిటీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తిగల వారు సెప్టెంబర్ 15వ తేదీ లోపు నిర్ధిష్ట ప్రవేశ రుసుము చెల్లించి వ్యక్తిగతంగా కానీ, ఆన్‌లైన్‌లో కానీ హాజరు కావచ్చునన్నారు. మరిన్ని వివరాల కోసం సదస్సు చెర్మన్ ప్రొఫెసర్ సాధన కె.ఘోష్, నిర్వాహకుడు డాక్టర్ వైసేల్. పీ. థోరన్‌లను సంప్రదించాలని సూచించారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ చత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
» 289కి పెరిగిన మరణాలు


పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని ఆష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
» జూలై 13న గాజాలో అంతం చేశాం
» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్లు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

» హిమాచల్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి!
» 50 మంది గల్లంతు.. ఐదుగురి దుర్మరణం
» ఉత్తరాఖండ్‌లో రాత్రివేళ పోటెత్తిన వరద
» రాష్ట్రవ్యాప్తంగా వర్షాలకు 12మంది మృతి


వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

శిమ్లా, డెహ్రాడూన్, జైపూర్, ఆగస్టు 1: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కులు, పథార్, మండి, శిమ్లా జిల్లాలను వరద ముంచెత్తింది. 50 మంది గల్లంతవగా.. వీరిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు, బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీఖండ్ మహదేవ్ సమీపంలో బుధవారం రాత్రి క్లౌడ్ బరస్ట్‌తో సర్పారా, గాన్వీ, కుర్బన్ నల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. పార్వతి నదిపై మలానా డ్యామ్ కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలను నీరు ముంచెత్తింది. శిమ్లా జిల్లా రాంపూర్‌లోని సమేజ్‌ఖడ్‌లో 30 మంది కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు మృతిచెందారు. మండి జిల్లా తెరాంగ్ సమీపంలోని రాజ్‌బన్ గ్రామం వద్ద మరో క్లౌడ్ బరస్ట్ జరిగింది. ఏడుగురు గల్లంతవగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. కాగా, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం న మోదైంది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు
» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా.." అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రెటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

ఉడకని అన్నం.. నీళ్ల చారు..

తినలేక పారేస్తున్న విద్యార్థులు - స్నానానికీ నీళ్లు కరువు - కౌడిపల్లి గురుకులం దుస్థితి


అన్నం పారేస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి, ఆగస్టు 1: ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు.. స్నానం చేద్దామంటే నీళ్లు రావు. ఇదీ కౌడిపల్లిలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకులం పరిస్థితి. నాలుగు రోజులుగా హాస్టల్‌కు మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గురువారం విద్యార్థులు నిరసన తెలిపారు. తమ గోడును పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కౌడిపల్లిలోని తెలంగాణ గిరిజన గురుకుల (బాలుర) పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 360 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ గురుకులంలో కొన్ని రోజుల నుంచి ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు వడ్డిస్తున్నారని.. అన్నం తినలేక చాలా మంది పారేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకూ ఇబ్బందులు పడుతు న్నామన్నారు. స్నానం చేసేందుకు నీరు లేకపోవడంతో పంట పొలాల వద్దకు వెళ్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారు లు స్పందించి గురుకులంలో నాణ్యమైన భోజనం అందించాలని, మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా రిజిస్ట్రార్‌గా వల్లి సుబ్బలక్ష్మి

పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్‌లుగా రవికాంత్, శ్రీనివాస్



కంది, ఆగస్టు 1: ఉమ్మడి మెదక్ జిల్లా రిజిస్ట్రార్‌గా వల్లి సుబ్బలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా రిజిస్ట్రార్లను, సబ్ రిజిస్ట్రార్‌లను బదిలీ చేస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వల్లి సుబ్బలక్ష్మి హైదరాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఎం.రవీందర్‌రావు హైదరాబాద్ సౌత్‌కు బదిలీ అయ్యారు. ఇదే కార్యాలయంలో ఉన్న పటాన్‌చెరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా శేరిలింగంపల్లి నుంచి రవికాంత్, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా శంకర్‌పల్లి నుంచి శ్రీనివాస్‌లు బదిలీపై వచ్చారు. పటాన్‌చెరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగిన హనుమంతరావు ఘట్‌కేసర్‌కు, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన షేర్ అలీ వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది పాత అధికారులను సన్మానించి వీడ్కోలు పలికారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.


కవి అందెశ్రీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి : అందెశ్రీ

చేర్యాల, ఆగస్టు 1: జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలని కవి అందెశ్రీ అన్నారు. చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యతోనే వివేకం వర్ధిల్లుతుందని, చదువును మించిన సంపద సృష్టిలో లేదన్నారు. అందెశ్రీని పాఠశాల హెచ్ ఎం అయిలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

సుప్రీం తీర్పును అమలు చేయాలి: ప్రొఫెసర్ కాసీం

గజ్వేల్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రెండు తెలుగు రాష్ట్రాలు అమలుపరచాలని ప్రొఫెసర్ కాసీం డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో గజ్వేల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, విలేకరులతో మాట్లాడారు. ఈ తీర్పు మాదిగలకు అనుకూలం.. మాలలకు వ్యతిరేకంగా భావించవద్దని, మాల మేధావు లు స్పందించి మాల, మాదిగల మధ్య అగాధాన్ని తొలగించాలన్నారు. ఆయన వెంట ఎంఈఎఫ్ నాయకులు చేబర్తి యాదగిరి, లలిత, ఉప్పరిపల్లి నాగభూషణం, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ తదితరులున్నారు.

మాజీ మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

● బీఆర్ఎస్ నాయకులు ఆరోపణ

మాజీ మంత్రి సబితారెడ్డి ఇంద్రారెడ్డిపై అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు గురువారం సీఎం దిష్టిబొమ్మలు దహనం చేసి రాస్తారోకో నిర్వహించారు. నిండు శాసనసభలో ఎంతో అనుభవం ఉన్న ఎమ్మెల్యే సబితారెడ్డిని కించపరిచే విధంగా మాట్లాడడం సరైనది కాదని, మహిళలకు సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



ములుగు: రాజీవ్ రహదారిపై దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



మద్దూరు: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చేర్యాల: గాంధీచౌక్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



సిద్దిపేట టౌన్: హౌజింగ్‌బోర్డు కమాన్ వద్ద రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



దుబ్బాక: చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వర్గల్: అంబేద్కర్ చౌరస్తా వద్ద చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు



ధూళిమిట్ట: మండల కేంద్రంలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



హుస్నాబాద్: ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు



జగదేవ్‌పూర్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కొండపాక: వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు



చేర్యాల: కొమురవెల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీఎంఆర్‌ను గడువులోపు డెలివరీ చేయాలి



బియ్యం బస్తా తూకాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు, ఆగస్టు 1: జిల్లాలోని రైస్ మిల్లరులందరూ వానాకాలం, యాసంగి (2023-24)కు సంబంధించిన సీఎంఆర్‌ను ప్రభుత్వానికి గడువులోగా సెప్టెంబరు 30 లోపు డెలివరీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. గురువారం మండలంలోని విఠలాపూర్ గోదాములో పౌరసరఫరాల సంస్థకు కస్టం మిల్డ్ బియ్యం (సీఎంఆర్) డెలివరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రైస్ మిల్లరులందరూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి నాణ్యత ప్రమాణాలు పాటించి పౌరసరఫరాల సంస్థకు సీఎంఆర్ డెలివరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీశ్, జిల్లా రైస్ మిల్లర్‌ల అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్, రైస్ మిల్లర్‌లు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చేర్యాల, ఆగస్టు 1: చేర్యాల, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాల పరిసర గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. గురువారం ఆయన నిందితుడి వివరాలు వెల్లడించారు. బచ్చన్నపేట మండలకేంద్రానికి చెందిన కొల్లూరి సంజీవకుమార్ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి మార్చురీ విభాగంలో పనిచేస్తున్నాడు. నెలన్నర రోజులుగా ధూల్‌పేట తదితర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి చేర్యాల, బచ్చన్నపేట మండలాల్లో విక్రయిస్తున్నాడు. వీరన్నపేట శివారులో గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని 175గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఇసుక కుప్ప మాయం!

చిన్నకోడూరు, ఆగస్టు 1: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు పట్టుకుని ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మూడు కుప్పలుగా నిల్వ చేశారు. రెండు ఇసుక కుప్పలకు (సుమారు 90 టన్నులు) గత నెల 23న అధికారులు వేలం నిర్వహించారు. వేలంలో ఓ వ్యకి ఇసుకను దక్కించుకోగా రూ. 2లక్షల 5 వేలు ఆదాయం వచ్చింది. కార్యాలయ ఆవరణలో ఉన్న మరో ఇసుక కుప్ప (టిప్పర్ ఇసుక) మాయమవడం చర్చనీయాంశంగా మారింది. గత ఆది, సోమవారాలు వరుసగా సెలవులు రావడం. కార్యాలయం వైపు ఎవరు రాకపోడంతో ఇదే అదునుగా భావించి ఇసుక కుప్పను మాయం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయ ఆవరణలోని ఇసుక కుప్ప మాయమై సుమారు మూడు రోజులు గడుస్తున్నా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక కుప్ప మాయమవడంపై తహసీల్దార్ జయలక్ష్మిని సంప్రదించగా ఆ ఇసుక కుప్ప అక్కడే ఉందని తాను చూసి చెప్తానని చెప్పడం గమనార్హం. తహసీల్దార్‌ను మరోమారు సంప్రదించగా రెండు ఇసుక కుప్పలను వేలంలో దక్కించుకున్న వ్యక్తి ఇసుకను తీసుకెళ్లేటప్పుడు అందుబాటులో లేకపోవడంతో అతని వాహన డ్రైవర్ తెలియక ఆ రెండు కుప్పలతో పాటు మూడో కుప్పను తీసుకెళ్లాడని తెలిపారు. తీసుకెళ్లిన ఇసుకను తెచ్చి కార్యాలయ ఆవరణలో పోస్తానని ఆవ్యక్తి చెప్పాడని తహసీల్దార్ చెప్పారు.

క్యాంపు కార్యాలయంలో సీఎం ఫొటో పెట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 1: సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశం, ప్రోటోకాల్ ప్రకారం క్యాంపు కార్యాలయంలో సీఎం ఫొటో ప్రదర్శించాల్సి ఉన్నా సిద్దిపేటలో అందుకు భిన్నంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు.

రూ.10కే కిలో సేంద్రియ ఎరువు

● పంచాయతీ సెక్రటరీ మాదవ్ జాదవ్

మద్దూరు, ఆగస్టు 1: మండలంలోని రేబర్తి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్థుల ద్వారా సేకరించిన తడిపొడి చెత్తతో తయారు చేసిన సేంద్రీయ ఎరువుల్ని కిలో రూ.10లకే విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం పంచాయతీ సెక్రటరీ మాదవ్ జాదవ్ మాట్లాడారు. గ్రామంలో సేకరించిన తడిపొడి చెత్త ద్వారా ప్రభుత్వ ఉద్దేశాన్ని అమలు చేసే దిశలో కంపోస్టు షెడ్డు ద్వారా సిబ్బంది సహకారంతో సేంద్రీయ ఎరువుల తయారీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సేంద్రీయ ఎరువుల వైపు దృష్టి సారించి నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించాలని సూచించారు. వచ్చిన ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. ఆయనవెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

● జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి

వర్గల్, ఆగస్టు 1: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్, ఎంపీటీసీ, పీఏసీఎస్‌తో పాటు గ్రామస్థాయి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించాలన్నారు. అందుకు కార్యకర్తల కృషి చేయాలన్నారు. పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల రాములు, జిల్లా ప్రతినిధి పూదరి నందన్‌గౌడ్, మండల కమిటీ నాయకులు శ్రీరామ్ శ్రీకాంత్, పంజాల వెంకటేశ్, పంపరి రమేశ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయమ్మ, భూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల అధ్యక్షులు, మండల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మారథాన్-2023-24లో సత్తాచాటిన విద్యార్థులు

గజ్వేల్, ఆగస్టు 1: దేశవ్యాప్తంగా ఏటీఎల్(అటల్ టింకరింగ్ ల్యాబ్) మారథాన్ 2023-24 కాంపిటీషన్‌లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ విద్యార్థులు సత్తా చాటారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం), నీతి ఆయోగ్ సంయుక్తంగా ఉత్తమ ప్రాజెక్టుగా సెయింట్ మేరీస్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టును ఎంపిక చేశాయి. దేశవ్యాప్తంగా 500 టీమ్స్ ఇందులో పాల్గొనగా సెయింట్ మేరీస్ సీబీఎస్ఈ పదోతరగతి విద్యార్థులు సుహిత, ఎం.వైష్ణవి రూపొందించిన వాక్ అవే బ్రిడ్జి ఫర్ పీపుల్ ప్రాజెక్టు ఏఐఎం-నీతి అయోగ్ సభ్యులను ఆకర్షించింది. ఈ ప్రాజెక్టు ప్రజలు రైల్వేస్టేషన్‌లో ఒక ఫ్లాట్ ఫాం నుంచి మరో ఫ్లాట్ ఫాంకు మారడంలో ఉన్న ఇబ్బందులను దూరం చేయడాన్ని విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నీతి అయెగ్ ప్రశంసలు పొందడం గర్వకారణం అన్నారు. వారిని కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, పాఠశాల డైరెక్టర్ ధామస్‌రెడ్డిలు ప్రధానోపాధ్యాయులు విజయపాల్‌రెడ్డి, రాయప్ప, గైడ్ టీచర్ నాగలక్ష్మి, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను అభినందించారు.



కొమురవెల్లి మండలం కిష్టంపేటలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్‌ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్ గత ఆదివారం లీకేజీకి గురైనా సత్వరం మరమ్మతులు చేపట్టకపోవడం తగదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ స్థానికులు గురువారం వాటర్‌ట్యాంక్ ఆవరణలో ఖాళీబిందెలతో నిరసన వ్యక్తంచేశారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి స్వామి మాట్లాడుతూ.. పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల కోసం రెండురోజుల క్రితమే సిబ్బందికి తెలిపామని, కానీ ఇతరగ్రామాల్లో పనులు వల్ల ఇక్కడ జాప్యం జరిగిందన్నారు. మిషన్ భగీరథ ఏఈ దివ్యను వివరణ కోరగా, పైప్‌లైన్ లీకేజీతో నీటిసరఫరా నిలిచిపోయిన విషయం గురువారమే తమ దృష్టికి వచ్చిందని, వివరాలు తెలుసుకుని మరమ్మత్తులు పూర్తిచేయించామన్నారు.

- చేర్యాల

పాఠశాలల్లో బోనాలు



కొండపాక: బోనాలతో విద్యార్థినులు

కొండపాక, ఆగస్టు 1: కొండపాకలోని వేద ఇంటర్నేషనల్ పాఠశాలలో గురువారం ఆషాఢ మాసం సందర్భంగా బోనాల సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. విద్యార్థులు, తల్లితండ్రులు మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించే అనంతరం విద్యార్థులు బోనాల విశిష్టత, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల వివరిస్తూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

● చిన్నకోడూరు: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గురువారం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాలను తయారు చేసి గ్రామ దేవతలకు సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: పోతరాజు వేషధారణలో విద్యార్థులు, పక్కన ఉపాధ్యాయులు

కాంగ్రెస్‌కు ఆడబిడ్డలను కించపరిచే సంస్కృతి లేదు

● సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిద్దిపేట టౌన్, ఆగస్టు1: ఆడబిడ్డలను కించపరిచి విమర్శించేలా మాట్లాడే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతున్న సమయంలో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవమానకరంగా మాట్లాడుతూ సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పోస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ఆడబిడ్డలను అవమానించే నీచమైన సంస్కృతి కేవలం బీఆర్ఎస్‌కే ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అక్కలు అని సంబోధిస్తూ మర్యాదగా మాట్లాడితే, దాన్ని తప్పుదోవ పట్టించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుట్రలు పన్నారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నదన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు విషయాన్ని గుర్తించాలన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా నిరుద్యోగుల కోసం ప్రవేశపెడుతున్న స్కిల్ యూనివర్సిటీలో భాగంగా బిల్లు ఆమోదం కోసం చర్చ జరుగుతున్న సమయంలో దానికి అడ్డుపడేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, సందీప్‌యాదవ్, అజ్మత్, రషాద్, నవీన్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ కుక్‌పోస్టుకు దరఖాస్తుల అహ్వానం

మద్దూరు, ఆగస్టు 1: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం 7వ తరగతి పాసై వంట చేయడంలో అనుభవం ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు పాసుఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో ఈ నెల 2 నుంచి 6 వరకు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9493972765 నెంబరు సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దౌల్తాబాద్/మర్కుక్, ఆగస్టు1: మండల పరిధిలోని తిర్మలాపూర్‌కు చెందిన బాధితుడు కొండేళ్ల స్వామికి మంజూరైన రూ.43 వేల 500 సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం తిర్మలాపూర్ మాజీ ఎంపీటీసీ బండారుదేవేందర్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, రమేష్ గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వేమ శ్రీనివాస్, శివంది నర్సింహులు, పడాల లచ్చయ్య రాజు, పవన్‌రెడ్డి ఉన్నారు.

మర్కుక్ మండలంలోని పాములపర్తికి చెందిన బాలరాజుకు 15వేలు, చెక్కుల చంద్రశేఖర్‌కు 17వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎంపీపీ పాండుగౌడ్ అందజేశారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

గజ్వేల్/చేర్యాల, ఆగస్టు 1: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా ఎస్ఐలు శంకర్, యాదగిరిరెడ్డిలతో కలసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. వారితో సిబ్బంది పండరి, స్వామిగౌడ్, అమర్, భవాని, స్వాతి, శ్రీలత ఉన్నారు.

మొక్కలను నాటడంతో పాటు సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అన్నారు. చేర్యాల మునిసిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పెద్దమ్మగడ్డ కాలనీలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోహెడ మండల టైలర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

కోహెడ, ఆగస్టు 1: మండలంలోని తంగళ్లపల్లి వేణుగోపాల స్వామి దేవస్థానం (కిష్టస్వామి) గుట్ట ఆవరణలో మండల టైలర్స్ యూనియన్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగ్గిళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మోగిలిపాలెం కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా బోగ ఆంజనేయులు, కోశాధికారిగా తుమ్మ రాజు, కార్యదర్శిగా మెరుగు కనకరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాలస్థాయిని నిలబెట్టాలి

● ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి

మర్కుక్, ఆగస్ట్ 1: పాఠశాల స్థాయిని నిలబెట్టాలని ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు బాలకిషన్, సంతోషిమాతలకు గురువారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఉదయ్‌బాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూతపడుతున్న పాఠశాలను ఈ స్థాయిలో నిలబెట్టిన ఓంకార్ రాధాకృష్ణ, రామకృష్ణారెడ్డిలను అభినందించారు.

'రెండేళ్లు వచ్చే వరకు తల్లిపాలే పట్టించాలి'



కుకునూరుపల్లి: తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమతరెడ్డి

మద్దూరు/కుకునూరుపల్లి/చేర్యాల, ఆగస్టు 1: బిడ్డకు రెండేళ్ల వచ్చే వరకు అదనపు ఆహారం అందిస్తూ తల్లిపాలు కొనసాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత సూచించారు. ఈ నెల 1 నుంచి 7 వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దుర్గలత, మౌనిక, శోభ పాల్గొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తిప్పారం అంగన్‌వాడీ కేంద్రంలో కుకునూరుపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమతరెడ్డి తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. చేర్యాల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలు 1,2,3,6,11లలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి, సూపర్‌వైజర్ నాగమణి, ఏఎన్ఎం అమృత తదితరులున్నారు.

'మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి'

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వం అందించే పోత్సహకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. హుస్నాబాద్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో జూలైలో ఉన్నతి శిక్షణలో భాగంగా మగ్గం వర్క్ యూనిట్‌లో శిక్షణ పొందిన మహిళలకు గురువారం ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ హరిబాబు, ఏపీఎం శ్రీనివాస్, మగ్గం కిట్టు యూనియన్ డైరెక్టర్ డి. రాజలింగం, ఏపీవో పద్మ, రేణుక, సీసీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● అక్కన్నపేట ఎస్ఐ విజయ్ భాస్కర్



గజ్వేల్: ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

అక్కన్నపేట, ఆగస్టు 1: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విజయ్‌భాస్కర్ సూచించారు. అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాలు, డ్రగ్స్, నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితులు పంపే మెసేజ్‌లకు రిప్లే ఇవ్వద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి తదితరులున్నారు.

● మిరుదొడ్డి: ప్రతిఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాములు సూచించారు. మిరుదొడ్డి ఆదర్శ పాఠశాలలో సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భారతి తదితరులున్నారు.

● చేర్యాల: విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని, తోటివారితో స్నేహపూర్వకంగా మెదలాలని, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. చేర్యాల పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో డ్రగ్స్, ర్యాగింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయనవెంట ఎస్ఐ దామోదర్, కస్తూర్బా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


● కొండపాక: మండలంలోని బందారం దర్గా ప్రాంతాన్ని అదనపు డీసీపీ ఎస్.మల్లారెడ్డి గురువారం సందర్శించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు జరిగే ఉర్సు ఉత్సవం సందర్భంగా దర్గా చుట్టూ పక్క ప్రాంతాలను, పార్కింగ్ ప్రదేశాలను సందర్శించారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, అక్కన్నపేట ఎస్ఐ విజయ్ భాస్కర్, పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్: గజ్వేల్ మండలం కొడకండ్ల ప్రాథమిక పాఠశాల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌కు విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదునాల శ్రీనివాస్‌తో కలసి ఎస్ఐని కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎస్ఐ శ్రీనివాస్ తప్పకుండా పెట్టిస్తానని హామీ ఇచ్చారు.

సిద్దిపేట జిల్లా ఎడీపీహెచ్‌వోగా సీహెచ్ ధనరాజ్

సిద్దిపేట టౌన్, ఆగస్టు1: సిద్దిపేట జిల్లా అదనపు డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ (ఎడీపీహెచ్‌వో)గా డాక్టర్ సీహెచ్. ధనరాజ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం సాయంత్రం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరిని డాక్టర్ ధనరాజ్ మర్యాదపూరంకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జిగా జగత్‌కుమార్‌రెడ్డి



సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 1: జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జగత్‌కుమార్‌రెడ్డిని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జిగా కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బీసీ సంక్షేమశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సరోజ జూలై 31న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

'రైతుల ఉసురు తీసుకోవడం సరికాదు'

గజ్వేల్, ఆగస్టు 1: అధికారులు రైతుల ఉసురు తీసుకోవడం సరికాదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ మండలం ముత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బోండ్ల పోచయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న ప్రతాప్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పోచయ్యకు చెందిన భూమి ఆర్‌అండ్ ఆర్ కాలనీలో పోగా ఎకరానికి 12గుంటల చొప్పున 36గుంటల భూమిని ఇస్తామని అధికారులు చెప్పి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇవ్వకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై గుండెపోటుతో పోచయ్య మృతిచెందారన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ నీర్ల శ్యామల మల్లేశ్, నాయకుల

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు, ఆగస్టు 1: ములుగు క్లస్టర్ రైతు వేదిక పరిధిలోని ములుగు, నాగిరెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లి, అడవిమసీద్, నర్సంపల్లి, కొట్యాల, అలీనగర్, బైలంపూర్, తనేదర్‌పల్లి, మామిడ్యాల్ గ్రామాల రైతులు ఆగస్టు 5వ తేదీలోపు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని, రైతులు దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకాల జిరాక్స్, రైతు ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ ఇవ్వాలని ములుగు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి పృథ్వీరాజ్ సూచించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

● ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు



సిద్దిపేట క్రైం: స్వీట్లు పంచుకుంటున్న న్యాయవాదులు

గజ్వేల్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ చిత్రపటానికి ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, రాష్ట్ర నాయకులు లలితతో కలసి క్షీరాభిషేకం చేశారు. వారితో ఎంఈఎఫ్ నాయకులు ఉప్పరిపల్లి నాగభూషణం, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మని మహేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఉబ్బని ఆంజనేయులు, గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ షనిగారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.


● సిద్దిపేట క్రైం: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సిద్దిపేటలో ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భూమిగారి మనోహర్, చింతమడక కనకయ్య కర్రోల్ల రవిబాబు, సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఇతర సీనియర్ న్యాయవాదులు యాదగిరి, రాజు, సురేందర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

● దుబ్బాక: సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ దుబ్బాకలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, సంజీవ్, ఎల్లం, బద్రి, కనకరాజు, రామచంద్రం, జోగయ్య, యాదగిరి, పద్మయ్య, దేవరాజు, రవి, కనకయ్య, పరుశురాములు, రాములు, చంద్రం, లింగయ్య, నర్సింహులు తదితరులున్నారు.

● కొండపాక: అణగారిన, అట్టడుగు వర్గాలకు హక్కులు సాధించాలనే ఏకైక లక్ష్యంతో 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ చేసిన పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో తెరపడిందని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాకీ ప్రభాకర్ పేర్కొన్నాడు.

● చేర్యాల: ఎస్సీ వర్గీకరణ పట్ల సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునివ్వడం హర్షించదగిందని బీఆర్ఎస్ కొమురవెల్లి మండల నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు.

● దౌల్తాబాద్: ఎస్సీ వర్గీకరణ అవసరమని సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు వెల్లడించడం చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థి సమైక్య అధ్యక్షుడు ఈదన్నగారి సింహాచలం అన్నారు. కార్యక్రమంలో మంతూరి రాములు, డప్పు శ్రీనివాస్, ఉప్పల గంగాధర్, ఆశనోళ్ల చంద్రం, స్వామి, శ్రీనివాస్, కనకయ్య, ఈదన్నగారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ టౌన్: అంబేద్కర్ చౌరస్తాలో సంబురాలు జరుపుకుంటున్న నాయకులు